సాక్షి
నారాయణపేట
ఆదివారం | 3 | నవంబర్ | 2024



..ముప్పతిప్పలు

ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్మేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు.

వివరాలు 8లో ▸



6 యూనిట్లలో విద్యుదుత్పత్తి

జూరాల ఎగువ, దిగువ కేంద్రాల్లోని ఆరు యూనిట్లలో విద్యుదుత్పత్తి కొనసాగుతుంది.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.3 /21.1

ఉదయం నుంచి ఎండ ప్రభావం ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమవుతుంది. చిరుజల్లులు కురవవచ్చు.

న్యూస్‌రీల్

30 పోలీస్ యాక్ట్ అమలు

నారాయణపేట రూరల్: శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా జిల్లావ్యాప్తంగా ఈ నెలాఖరు వరకు 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్పీ యోగేష్ గౌతమ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపు, ధర్నాలు, ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడేలా కార్యక్రమాలు నిర్వహించరాదని సూచించారు. అనుమతి లేకుండా కార్యక్రమాలు చేపడితే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జనజీవనానికి ఇబ్బంది కలిగించే సమావేశాలు, జన సమూహం చేయడం నిషేధమన్నారు. సోషల్ మీడియాలో అనవసరమైన విషయాలు, మతాల మధ్య చిచ్చుపెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. చట్టపరమైన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ ప్రకారం శిక్షార్హులవుతారని హెచ్చరించారు.

స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట: ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులకు అర్హులైన వైద్యులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ రామకిషన్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆధ్వర్యంలో జరిగే ఈ నియామకాలకు డాక్టర్లు నేరుగా తమ సర్టిఫికెట్లతో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అప్పక్‌పల్లిలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలలో హాజరుకావాలని కోరారు. గౌరవ వేతనంతో కూడిన కాంట్రాక్ట్ ప్రాతిపదికన వివిధ స్పెషాలిటీలకు సంబంధించిన ప్రొఫెసర్లు 7, అసోసియేట్ ప్రొఫెసర్లు 16, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 14, సీనియర్ రెసిడెంట్లు 19 పోస్టుల భర్తీకి దరఖాస్తు ఆహ్వానిస్తున్నామన్నారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొపెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎండీ, ఎంఎస్, పీజీ, డిగ్రీలో సాధించిన మార్కులు పరిగణలోకి తీసుకుంటామని, ఆర్‌ఓఆర్‌ను అనుసరిస్తామని చెప్పారు. సీనియర్ రెసిడెంట్ పోస్టులకు దరఖాస్తుదారుడి వయసు నోటిఫికేషన్ నాటికి 45 ఏళ్లలోపు ఉండాలని, స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. నోటిఫికేషన్‌కోసంwww.fmcnarayanpet.org,https://narayanpet.telangana.gov.in సంప్రదించగలరని సూచించారు. ప్రొఫెసర్ల వేతనం నెలకు రూ.1,90,000, అసోసియేట్ ప్రొఫెసర్లు వేతనం నెలకు రూ. 1,50,000, అసిస్టెంట్ ప్రొఫెసర్ల వేతనం నెలకు రూ. 1,25,000, సీనియర్ రెసిడెంట్ వేతనం నెలకు రూ.92,575 చెల్లిస్తారన్నారు. దరఖాస్తుతోపాటు ఒరిజినల్ అకాడమిక్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజు ఫొటో, రెండు సెట్ల అకాడమిక్ సర్టిఫికెట్ల ఫొటో కాపీలతో హాజరు కావాలని సూచించారు.

నేడు రాష్ట్రస్థాయి గోగేమ్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ స్కూల్ ఇండోర్‌లో ఈనెల ఆదివారం రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్, జూనియర్ బాలబాలికల గోగేమ్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర గోగేమ్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నసరుల్లా హైదర్, గులాం అఫ్రోజ్, కోశాధికారి వినోద్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికయ్యే క్రీడాకారులు ఈ నెల 15 నుంచి 17 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి సబ్ జూనియర్, జూనియర్ గోగేమ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మిగతా వివరాల కోసం సంఘం సీనియర్ ఉపాధ్యక్షుడు ఎండీ షకీల్ 9885242848ను సంప్రదించాలని కోరారు.

ఆర్‌ఎన్‌ఆర్ @ రూ.2,213

దేవరకద్ర: మార్కెట్ యార్డులో శనివారం జరిగిన టెండర్లలో ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,213, కనిష్టంగా రూ.1,900గా ధరలు లభించాయి. హంస క్వింటాల్‌కు గరిష్టంగా రూ.1,900 వచ్చింది.

నేడు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

నారాయణపేట: జిల్లా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు విద్యుత్ వినియోగదారుల దినోత్సవ కార్యక్రమాన్ని స్థానిక ఎస్ఈ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎస్ఈ సంజీవరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మక్తల్, కోస్గిలకు సంబంధించిన వినియోగదారుల దినోత్సవ కార్యక్రమాన్ని ఆయా ఏడీ కార్యాలయాల్లో నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా జిల్లా వినియోగదారులు, రైతులు సదస్సుకు హాజరై సీజీఆర్ఎఫ్ విద్యుత్ అంబుడ్స్‌మెన్ శాఖల వివరాలు, విద్యుత్ కనెక్షన్లు సకాలంలో అందించే వివరాలు, సభ్యులను ఆదా చేయడం, నాణ్యమైన విద్యుత్ పరికరాల వాడకం, విద్యుత్ టారిఫ్‌ల వివరాలు పొందాలన్నారు. అలాగే విద్యుత్ సమస్యలు అధిక బిల్లులు, పేరు, చిరునామా మార్పిడి, లోటల్టేజీ, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు తదితర వాటిపై ఫిర్యాదులు అందించి పరిష్కారం పొందాలని సూచించారు.

బ్రహ్మోత్సవం

పాలమూరులో మొదలైన జాతర్ల సందడి

సండే స్పెషల్

వలసల జిల్లాగా పేరెన్నికగన్న పాలమూరు మరో ప్రత్యేకతను సంతరించుకుంది.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రధాన దేవాలయాలతోపాటు.. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నపాటి ఆలయాల వరకు ప్రత్యేకంగా బ్రహ్మోత్సవాలు, జాతర్లు కొనసాగుతాయి. ప్రతి జాతర సుమారు నెలరోజులపాటు నిర్వహించడం ఇక్కడి విశేషం. వీటి కోసం పొట్ట చేతబట్టుకొని వలస వెళ్లిన పాలమూరు కూలీలంతా స్వగ్రామాలకు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. ప్రతి దేవుడిని తమ ఇంటి ఇలవేల్పుగా భావించి.. మట్టి కుండలో అన్నం వండి.. పచ్చి పులుసుతో నైవేద్యం సమర్పిస్తారు. సమీప గ్రామాల ప్రజలు బంధుమిత్రులతో కలిసి ఎద్దుల బండ్లపై ఆయా ఆలయాలకు వెళ్లి రెండురోజులపాటు అక్కడే గడపడానికి ఇష్టపడతారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో జాతర నిర్వహించే ఆలయాల ప్రత్యేకతపై 'సాక్షి' కథనం..

- మహబూబ్‌నగర్ డెస్క్



సింగోటం లక్ష్మీనర్సింహస్వామి రథోత్సవానికి తరలివచ్చిన అశేష భక్తజనం (ఫైల్)

- దీపావళితో మొదలై.. ఉగాది పండుగ వరకు కొనసాగింపు
- తమ ఇంటి ఇలవేల్పుగా కొలిచి మొక్కులు
- మట్టికుండలో భోజనం, పచ్చిపులుసుతో నైవేద్యమే పరమాన్నం
- ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాలకు తిరుపతి వెంకన్నతో సారూప్యత

ప్రత్యేకం.. ఉద్దాల ఉత్సవం

చిన్నచింతకుంట మండలం అమ్మాపురంలో వెలసిన కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు, జాతర దీపావళి అమావాస్యకు మొదలవుతుంది. రాష్ట్రంలోని మేడారం తర్వాత ఆ స్థాయిలో ఇక్కడికే జనాలు ఇక్కడికి తరలివస్తారు. అలాగే స్వామివారు తిరుమల వేంకటేశ్వరస్వామి మాదిరిగానే ఏడుకొండల మధ్య కాంచన గుహలో కొలువుదీరారు. ఇక్కడ ఎక్కడా లేని విధంగా ఉద్దాల ఉత్సవం (పాదరక్షల ఊరేగింపు) ప్రధాన ఘట్టంగా నిలుస్తోంది. చిన్నవడ్డెమాన్‌లో మొదలయ్యే ఈ ఊరేగింపు కార్యక్రమం అప్పంపల్లి, తిర్మలాపూర్ గ్రామాల మీదుగా కురుమూర్తికి చేరుకుంటుంది. దాదాపు నెలరోజులపాటు సాగినా.. భక్తుల రద్దీ దృష్ట్యా జాతరను పొడిగించిన సందర్భాలు కోకొల్లలు. అలాగే ఇక్కడ లభించే కాల్చిన మటన్ కోసం రాష్ట్రం నలుమూలల నుంచి మాంసప్రియులు తరలివస్తారు.



కురుమూర్తిస్వామి ఉద్దాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు (ఫైల్)



ఊర్కొండపేటలోని అభయాంజనేయస్వామి మూలవిరాట్

ఉమ్మడి జిల్లాలోని మరికొన్ని ఊర్కొండపేట, బీచుపల్లి, సిర్సనగండ్ల, మద్దిమడుగు, దేవరకద్ర మండలం చిన్నరాజమూరు, కొత్తకోట మండలం పాతపల్లి, మక్తల్ పడమటి ఆంజనేయస్వామి, జడ్చర్ల, మల్దకల్ వేంకటేశ్వరస్వామి, ఎత్తం గట్టు జాతర్లు సైతం ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ఈ ఆలయాలు అన్నిచోట్ల మట్టికుండలోనే అన్నం, పచ్చిపులుసుతో నైవేద్యం సమర్పిస్తారు. అయితే కొత్తకోట మండలం పాతపల్లిలో వెలసిన ఆంజనేయస్వామికి ఎక్కడా లేని విధంగా మాంసాహారం, కల్లుసీసాతో నైవేద్యం సమర్పించడం గమనార్హం.

వసతులు అరకొరే..

ఉమ్మడి పాలమూరులో జరిగే ఉత్సవాల సందర్భంగా వివిధ రకాల వేలం పాటలు, హుండీల ద్వారా ప్రభుత్వానికి రూ.లక్షల్లో ఆదాయం లభిస్తోంది. ప్రధానమైన మన్యంకొండ వేంకటేశ్వరస్వామి ఆలయం ద్వారా రూ.3 కోట్లు, కురుమూర్తిస్వామి జాతర సందర్భంగా రూ.కోటిన్నరకుపైనే ఆదాయం సమకూరుతుండగా.. మిగతా ఆలయాల నుంచి రూ.లక్షల్లో సొమ్ము ప్రభుత్వ ఖజానాకు చేరుతోంది. అయితే జాతర్లలో భక్తులకు కనీస వసతులు సమకూర్చలేకపోతున్నారు. భక్తులు బస చేయడానికి షెల్టర్లు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది.

గతేడాది వేలం ద్వారా సమకూరిన ఆదాయంరూ.1,72,56,000
ఈ సంవత్సరం వేలం ద్వారా సమకూరిన ఆదాయం : 1,74,26,000
గతేడాది స్వామివారిని దర్శించుకున్న భక్తులు సుమారు 8 లక్షలు
గతేడాది స్వామివారి హుండీ ఆదాయం రూ.66,04,407

తెలంగాణ తిరుపతి..

తిరుపతికి మన్యంకొండకు చాలా దగ్గరి పోలికలు ఉండడంతో తెలంగాణ తిరుపతిగా పిలుస్తారు. ఆర్థిక స్థోమత లేని భక్తులు మన్యంకొండకు వచ్చి స్వామివారిని దర్శించుకుంటే తిరుపతికి వెళ్లినంత పుణ్యం లభిస్తుందని నమ్ముతారు. తిరుపతిలో ఏడుకొండలు ఎక్కి స్వామివారిని దర్శించుకున్న విధంగానే మన్యంకొండ దేవస్థానం చుట్టూ ఏడుకొండలు ఉన్నాయి. తవ్వని కోనేరు, చెక్కని పాదాలు, ఉలి ముట్టని స్వామి ఇక్కడ వెలిశాడని నమ్ముతారు. దాదాపు 600 ఏళ్ల చరిత్ర గల దేవస్థానం దినదినాభివృద్ధి చెందుతోంది. స్వామివారు భక్తుల ఇంటి ఇలవేల్పుగా, కోరిన వారి కొంగుబంగారంగా వెలుగొందుతున్నారు. ఇక్కడ కూడా స్వామివారి బ్రహ్మోత్సవాలు, జాతర కలిపి దాదాపు నెలరోజుల పాటు జరుగుతుంది.



మన్యంకొండ వద్ద మట్టికుండలో (భోజనం) నైవేద్యం వండుతున్న మహిళలు

గతేడాది వేలం ద్వారా సమకూరిన ఆదాయం : రూ.1.50 కోట్లు
గతేడాది స్వామివారి హుండీ ఆదాయం రూ.కోటిపైనే..
గతేడాది స్వామివారిని దర్శించుకున్న భక్తులు సుమారు 5 లక్షలు



గంగాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం (ఇన్‌సెట్‌లో స్వామివారు)

గంగాపూర్ శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం కోణార్క్ సూర్యదేవాలయం ఒకే విధంగా నిర్మించారని ప్రతీతి. ఆలయం చతురస్రాకారంలో నిర్మితమై ఉండటం ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. అలాగే మెట్లు సైతం చతురస్రాకారంలో మెట్లు నిర్మించడం వల్ల ఎటు నుంచి చూసినా కోనేరు ఒకేలా కనిపిస్తుంది. స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రతిఏటా మాఘశుద్ధ పాడ్యమి మొదలు నవమి వరకు కొనసాగుతాయి. ఇక్కడ స్వామివారి కల్యాణోత్సవం, పెద్ద తేరు (రథోత్సవం), చిన్న తేరు (పుష్పరథం), శకటోత్సవం ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ఆలయం పడమర ప్రాంతమైన కోయిలకొండ, కోస్గి, కొడంగల్, తాండూరు, నారాయణపేట నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు వస్తారు. తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు హాజరవుతారు.

గతేడాది వేలం ద్వారా సమకూరిన ఆదాయం	గతేడాది స్వామివారి హుండీ ఆదాయం	గతేడాది స్వామివారిని దర్శించుకున్న భక్తులు
రూ.44,15,900	రూ.14,80,399	సుమారు 3 లక్షలు



లక్ష్మీనర్సింహస్వామి మూలవిరాట్

కొల్లాపూర్ మండలం సింగోటంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రతి సంవత్సరం జనవరి సంక్రాంతి పండుగ సమయంలో ప్రారంభమవుతాయి. బ్రహ్మోత్సవాలు ముగిశాక నెలరోజుల పాటు జాతర కొనసాగుతుంది. జాతరకు తెలంగాణతోపాటు రాయలసీమ నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ప్రధానంగా రథోత్సవాన్ని తిలకించేందుకు సుమారు 50 వేల మందికిపైగా భక్తులు వస్తారు. ప్రధానంగా ఉమ్మడి కర్నూలు జిల్లా నందికొట్కూరు పరిసర గ్రామాల నుంచి కృష్ణా నదిని మరబోట్లలో వచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు.

గతేడాది వేలం ద్వారా సమకూరిన ఆదాయం :	గతేడాది స్వామివారి హుండీ ఆదాయం
రూ.35.50 లక్షలు	రూ.17.30 లక్షలు
గతేడాది స్వామివారిని దర్శించుకున్న భక్తులు సుమారు 2.50 లక్షలు	

వ్యాపారులకు పండగే..

ఉమ్మడి జిల్లాలో నిర్వహించే జాతర్లు వ్యాపారులకు కాసుల వర్షం కురిపిస్తాయి. చిన్నారులు ఆడుకునే రంగుల రాట్నాలు, ఆట వస్తువులు, వంట సామగ్రి, బొంగుల పుట్నాలు, మిఠాయి, గాజుల దుకాణాలు ఇలా అన్ని రకాల వ్యాపారాలు జోరుగా సాగుతాయి. ఒక జాతర తర్వాత మరొకటి వస్తుండటంతో వ్యాపారులు కూడా అన్ని జాతర్లు తిరిగి వ్యాపారాలు సాగిస్తారు.

రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: జిల్లాలోని రైస్ మిల్లర్లు వరిధాన్యం కొనుగోలులో ప్రభుత్వానికి బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైస్ మిల్లర్ల యాజమాన్యం, సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రైస్ మిల్లర్లు వరిధాన్యం కొనుగోలు బ్యాంకు గ్యారంటీ 10 శాతం ఇస్తూ సోమవారం నాటికి అగ్రిమెంట్లు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సివిల్ సప్లయ్ అధికారి సుదర్శన్, రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్యదర్శి భరత్, నారాయణ జగదీష్, హరీష్, కృష్ణ, రఘు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో కాంగ్రెస్ శ్రేణులు భాగస్వామ్యం కావాలి



మాట్లాడుతున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

నారాయణపేట: సమగ్ర కుటుంబ సర్వేలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భాగస్వామ్యం కావాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు శనివారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటా సర్వేపై డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ శ్రేణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే దేశంలోనే పెద్ద సాహసోపేతమైన నిర్ణయం అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు కచ్చితత్వంతో ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలనే ఉద్దేశంతో సర్వే నిర్వహిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అందరూ ఈ సర్వేలో భాగస్వామ్యం కావాలన్నారు. జిల్లాలో పటిష్ట నాయకత్వం ఉందని పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. అలాగే టీపీసీసీ సభ్యుడు చిట్టెం అభిజయ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక, సామాజిక, రాజకీయ, కుల గణన చేపట్టడం జరిగిందన్నారు. పని చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నా.. ప్రతిక్షణం వారిని సమన్వయం చేసుకొని కాంగ్రెస్ క్యాడర్ సర్వేలో పాలుపంచుకోవాలని కోరారు. సర్వే దేశంలోనే అన్ని రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్‌గా మారుతుందన్నారు. డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ఈ నెల 6 నుంచి 30లోగా కులగణన పూర్తి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ విజయకుమార్, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, వైస్ చైర్మన్ హన్మంతు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు ఎండీ గౌస్, ప్రసన్నకుమార్‌రెడ్డి, నాయకులు ఎండీ సలీం, శివకుమార్, నరహరి, శ్రీనివాస్, మహేష్, కాంతికుమార్, శరణప్ప, రవికుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

దళారుల బెడదను అరికట్టాలి



పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: మండలంలోని అప్పక్‌పల్లిలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) బృందం శనివారం పరిశీలించింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు పత్తి పంటకు మద్దతు ధరతోపాటు బోనస్ ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో అతివృష్టి, అనావృష్టి కారణంగా పత్తి రైతులు తీవ్రమైన కష్టనష్టాల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ఇటీవల వర్షాలకు పత్తిపంట తీవ్ర నష్టాలకు గురై దిగుబడి సగానికి పడిపోయిందని, అరకొరగా చేతికి వచ్చిన పంట అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి చందంగా మారి దళారుల పాలవుతుందన్నారు. ప్రభుత్వం నామమాత్రంగా సీసీఐ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి తేమశాతం 8 ఉంటేనే మద్దతు ధర రూ.7,521 చెల్లిస్తారని, లేదంటే ఒక శాతానికి రూ.75 ధర తగ్గించి 12 శాతం వరకు కొనుగోలు చేయడం సరికాదన్నారు. ఎన్నో ఆంక్షలు విధించి రైతుకు గిట్టుబాటు కాని మద్దతు ధర అందకుండా ప్రైవేటు వ్యాపారుల వైపు మొగ్గే విధంగా వారి వ్యవహార శైలి ఉందని విమర్శించారు. తేమ శాతం ఎక్కువ చూయించి క్వింటాకు రూ.వెయ్యి నుంచి రూ.1,500 తగ్గించి వ్యాపారులు కొనడం వల్ల రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు లేకుండా మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కాశీనాథ్, రాము, నారాయణ, బాలకృష్ణ, సాయిలు, భీమేష్, గొరప్ప తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు పూర్తి

అడ్డాకుల: మండలంలోని రాచాలలో ఆదివారం నుంచి ప్రారంభమయ్యే 68వ ఎస్‌జీఎఫ్ కబడ్డీ టోర్నమెంట్‌కు జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానాన్ని అధికారులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కబడ్డీ టోర్నమెంట్‌కు కావాల్సిన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. అండర్–17 బాలికలు, అండర్–19 బాలుర విభాగంలో కబడ్డీ పోటీలను నిర్వహించనున్నారు. శనివారం ఎంఈఓ కురుమూర్తి, అండర్–19 ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాపిరెడ్డి, పీఈటీ సోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, వడెన్న, కురుమూర్తిగౌడ్, నిరంజన్‌రావు, వినోద్‌కుమార్, సుచేతన్ కుమార్‌రెడ్డి కబడ్డీ మైదానాన్ని పరిశీలించారు. పోటీల నిర్వాహణకు నాలుగు సింథటిక్ మ్యాట్‌గ్రౌండ్‌లను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని ఉమ్మడి 10 జిల్లాలకు చెందిన 20 జట్లు పోటీల్లో పాల్గొంటుండగా.. 240 మంది క్రీడాకారులు ఇక్కడికి రానున్నారు. మూడు రోజుల పాటు డే అండ్ నైట్‌లో 40 కబడ్డీ లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో టోర్నీ నిర్వహించనున్నారు. క్రీడాకారులకు స్థానికంగానే వసతి ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంలు ఫయాజోద్దీన్, ప్రసన్నకుమార్, రామలింగం, ప్రకాష్, జ్యోతి పాల్గొన్నారు.

మయూర వాహనంపై కురుమూర్తిరాయుడు



అమ్మాపురం కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివార్ల కల్యాణం నిర్వహించగా.. రాత్రి ఉత్సవమూర్తులను మయూర వాహనంపై ఊరేగించారు. స్వామివారి నామస్మరణతో కురుమూర్తిగిరులు మార్మోగాయి.

వివరాలు 10లో ▸

- చిన్నచింతకుంట

క్లుప్తంగా

పదేళ్ల బాలికపై వృద్ధుడి లైంగిక దాడి

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన పదేళ్ల బాలికపై 65 ఏళ్ల వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. సీఐ కనకయ్యగౌడ్ వివరాల మేరకు.. ఇంటి వద్ద ఒంటరిగా ఆడుకుంటున్న బాలికను అదే గ్రామానికి చెందిన వృద్ధుడు మల్లయ్య మభ్యపెట్టి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆలస్యంగా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


పరుశరాముడు (ఫైల్)

ధరూరు: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని అల్వాలపాడు గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కేటీదొడ్డి మండలం నీలహళ్లికి చెందిన స్వామి ధరూరులో ఓ వ్యక్తి వద్ద గొర్రెలకాపరిగా పని చేస్తున్నాడు. దీపావళి పండుగ ఉందని.. తమ ఊరు నీలహళ్లిలో భోజనం చేసి వద్దామని ధరూరుకు చెందిన తన స్నేహితుడు పరుశరాముడు (18)తో కలిసి శుక్రవారం రాత్రి బైక్‌పై బయల్దేరారు. గద్వాల – రాయచూరు రహదారిలోని అల్వాలపాడు గ్రామం దాటిన తర్వాత మలుపు వద్ద వాహనం అదుపుతప్పడంతో కిందపడ్డారు. ప్రమాదంలో పరుశరాముడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్వామి పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గద్వాల మార్చురీకి తరలించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

గద్వాల క్రైం: విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన గద్వాల మండలం గుంటిపల్లిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ వివరాల మేరకు.. గుంటిపల్లికి చెందిన రామాంజనేయులు (18) తమ మేకలు, గొర్రెలను పట్టణ శివారులోని వ్యవసాయ పొలానికి మేత కోసం తీసుకెళ్లాడు. అయితే సమీపంలోని చెట్టు ఎక్కి కొమ్మలను తొలగిస్తున్న క్రమంలో విద్యుత్ హైటెన్షన్ వైర్లు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, రామాంజనేయులు మృతికి గ్రామంలోని సోలార్ ప్రాజెక్టే కారణమని పేర్కొంటూ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. సోలార్ ప్రాజెక్టు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. వ్యవసాయ పొలంలో ఉన్న విద్యుత్ తీగలను తొలగించి, సోలార్ ప్రాజెక్టుకు మరో లైన్ ఏర్పాటు చేసుకోవాలని కోరినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. బాధిత కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ మహిళ..

నాగర్‌కర్నూల్: తెలకపల్లి మండలం నడిగడ్డ గ్రామానికి చెందిన నస్రీన్ సుల్తానా (45) చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. నడిగడ్డకు చెందిన నస్రీన్ సుల్తానాకు తెలకపల్లి మండలానికి చెందిన జహీర్ అనే వ్యక్తి అధిక వడ్డీ ఆశ చూపడంతో కొంత నగదు అతడికి ఇచ్చింది. అతడు ఆమెకు నగదు తిరిగి ఇవ్వకుండా మోసం చేయడంతో మనస్తాపానికి గురై ఈ నెల 17న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి భర్త ఖాజా సలావుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

అప్పిరెడ్డిపల్లిలో మరో వ్యక్తి..


కొటకొండ వెంకటప్ప (ఫైల్)

మద్దూరు: మండలంలోని అప్పిరెడ్డిపల్లికి చెందిన కోటకొండ వెంకటప్ప (54) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు ఏఎస్‌ఐ ఉస్మాన్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. గతనెల 26న వెంకటప్ప మద్దూరు నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తూ.. నాగిరెడ్డికుంట మూలమలుపు వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య పద్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

పంట అమ్మకానికి ముప్పతిప్పలు


కర్ణాటకలోని రాయచూర్ మార్కెట్‌కు తరలుతున్న వరిధాన్యం

మొక్కుబడిగా కొనుగోలు కేంద్రాల నిర్వహణ

- రాయచూరు మార్కెట్‌కు ధాన్యం తరలింపు
- అటు కర్ణాటక, ఇటు తెలంగాణ చెక్‌పోస్టుల వద్ద రైతుల అవస్థలు
- సరిహద్దులో డబ్బుల వసూలుతో ఆందోళన


రైతు కల్లంలోనే ధాన్యం కొనుగోలు

కృష్ణా: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడం రైతులకు తలనొప్పిగా మారింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ సకాలంలో చేపట్టకపోవడం.. గన్నీ బ్యాగుల కొరత.. అప్పుడు, ఇప్పుడు అంటూ కాలయాపన చేయడం తదితర సమస్యలతో రైతులు సతమతమవుతున్నారు. మరోవైపు తాము ఇష్టమొచ్చిన చోట ధాన్యం విక్రయించేందుకు వెళ్తే.. నిబంధనల పేరుతో ముక్కుపిండి మరీ డబ్బు వసూలు చేస్తున్నారు. నారాయణపేట జిల్లా కృష్ణా మండలంలోని రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద రాయచూరు మార్కెట్‌కు ధాన్యం తరలించే వాహనాల నుంచి కొంతకాలంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 200 నుంచి రూ. 500 వరకు.. ఒక్కో లారీకి రూ. 2వేలు, పత్తిని తరలించే బొలేరో వాహనాలకు రూ. 100 చొప్పున వసూలు చేస్తున్నారు. కర్ణాటకలోని సైదాపూర్, మక్తల్, నర్వ, అమరచింత, దేవరకద్ర, మాగనూర్, ఊట్కూర్ మండలాల్లో పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు కర్ణాటకలోని రాయచూరు మార్కెట్‌కు తరలిస్తుంటారు. ఈ నేపథ్యంలో సరిహద్దు చెక్‌పోస్టు మీదుగా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. ఇటు తెలంగాణలోని చెక్‌పోస్టుతో పాటు అటు కర్ణాటక చెక్‌పోస్టు వద్ద డబ్బులు ఇవ్వందే వెళ్లనివ్వడంలేదని రైతులు వాపోతున్నారు.

దోపిడీ చేస్తున్నారు..



పంట పెట్టుబడి కోసం రాయచూరు మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్ల నుంచి ముందుగానే డబ్బు తీసుకోవడంతో వారికే ధాన్యం విక్రయిస్తున్నాం. రాయచూర్ మార్కెట్‌కు ధాన్యం తరలించేటప్పుడు తెలంగాణ చెక్‌పోస్టులో రూ. 200, కర్ణాటక చెక్‌పోస్టులో రూ. 500లతో పాటు అక్కడి పోలీసులు రూ. 200 నుంచి రూ. 500 వరకు తీసుకుంటున్నారు. ఇలా ఎక్కడికక్కడ రైతులను దోపిడీ చేస్తుండటంతో నష్టపోతున్నాం. – నాగభూషణం, రైతు, సీపురం, నర్వ మండలం

పొలం వద్దే అమ్ముతున్నాం..



కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించాలంటే రవాణా ఖర్చు భరించాల్సి వస్తుంది. ఒకవేళ తీసుకెళ్లినా గన్నీ బ్యాగుల సమస్య నెలకొంటుంది. దీంతో కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకెళ్లడం లేదు. పొలాలకే వ్యాపారులు వచ్చి ఎక్కువ ధరకు ధాన్యం కొంటున్నారు. – సోమ సంతోష్, రైతు, గుడెబల్లూర్, కృష్ణా మండలం

నిత్యం 60-80 టన్నుల ధాన్యం తరలింపు..

ప్రభుత్వం ఆగమేఘాల మీద ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఇప్పటి వరకు గన్నీ బ్యాగులు రాలేదు. నిర్వాహకులు సైతం ధాన్యం కొనుగోలుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ విషయంపై రైతులు పలుమార్లు ఐకేపీ అధికారులను సంప్రదిస్తే.. అప్పుడు, ఇప్పుడు అంటూ కాలయాపన చేస్తున్నారు. వీరి నిర్లక్ష్యం మూలంగా నిత్యం రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు మీదుగా వరిధాన్యం లారీలు 20 నుంచి 30 దాక వెళ్తుంటాయి. ఒక్కో లారీలో 3 టన్నులు అంటే మొత్తం 60 నుంచి 80 టన్నుల ధాన్యం ఇక్కడి నుంచి రాయచూరు మార్కెట్‌కు తరలుతోంది. ఇలా వారం రోజులుగా సుమారు 700 టన్నుల ధాన్యాన్ని తరలించినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరణ ప్రక్రియ చేపట్టాలని కోరుతున్నారు.

అనుమతులిచ్చిన వారే వ్యతిరేకిస్తే నమ్మాలా?


పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మించే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

రాజోళి: మండలంలోని పెద్దధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి బీజేపీ ప్రభుత్వం అనుమతులు ఇవ్వగా.. ఇక్కడి పార్టీ నాయకులు మాత్రం తమ ప్రభుత్వం, పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నట్లు మాట్లాడటం విడ్డూరంగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.వెంకటస్వామి ధ్వజమెత్తారు. పెద్దధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మించే స్థలాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ.. 27 ఎకరాల భూమిని పరిశ్రమ కోసం సేకరించామని చెబుతున్న ఫ్యాక్టరీ యాజమాన్యం.. 6 ఎకరాల 29 గుంటలకు మాత్రమే నాలా కన్వర్షన్ అనుమతి తీసుకున్నారని తెలిపారు. నామమాత్రపు అనుమతులతో పచ్చని పల్లెల్లో ఫ్యాక్టరీలు ఎలా కడతారని ప్రశ్నించారు. పరిశ్రమకు ఆనుకుని 156 ఎకరాల్లో దళితుల భూములు ఉన్నాయన్నారు. ప్రజల ప్రాణాలు, పచ్చని పంట పొలాలను లెక్కచేయకుండా ఇలాంటి ప్రమాదకర ఫ్యాక్టరీలను నెలకొల్పితే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. బీజేపీ నాయకులకు నిజంగా ప్రజలపై ప్రేమ ఉంటే.. తమ పార్టీలోని మంత్రులు, నాయకులతో మాట్లాడి, ఫ్యాక్టరీ నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి విజయ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు దేవదాసు, రాజు, పరంజ్యోతి, రమేష్ పాల్గొన్నారు.

పోస్ట్‌మేన్‌తో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ పొందండి

ఆత్మకూర్: పింఛన్‌దారులు పోస్ట్‌మేన్ ద్వారా జీవన్ ప్రమాణ్ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ పొందవచ్చని పోస్టల్ డిపార్ట్‌మెంట్ మహబూబ్‌నగర్ సూపరింటెండెంట్ ఎస్.విజయజ్యోతి తెలిపారు. శనివారం ఆత్మకూర్‌లోని పోస్టాఫీస్‌లో జీవన్ ప్రమాణ్ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఆధ్వర్యంలో రూ. 70 నామమాత్రపు రుసుముతో సంబంధిత అర్హులైన పింఛన్ దారులు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌ను సులభంగా పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వ, బ్యాంక్, రైల్వే, పోస్టల్ తదితర శాఖలకు చెందిన పింఛన్ దారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పింఛన్‌దారుడి ఐడీ, పింఛన్ పంపిణీ విభాగం, మొబైల్ నంబర్, పింఛను చెల్లింపు ఆర్డర్, బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్ వివరాలను అందించాల్సి ఉంటుందన్నారు. బయో మెట్రిక్ స్కాన్‌తో వివరాలు నమోదు చేయబడిన అనంతరం డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ జారీ అవుతుందన్నారు. కార్యక్రమంలో పోస్టల్ అధికారి నారాయణగౌడ్, అమరచింత, ఆత్మకూర్ పోస్‌మాస్టర్లు ఆనంద్‌గౌడ్, ప్రతాప్, సిబ్బంది ఉన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి



వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించి, 16 మందిపై కేసులు నమోదు చేశారు. ఎస్‌ఐ రామకృష్ణ వివరాల మేరకు.. తాటిపాములలో కొందరు వ్యక్తులు కోడి పందాలు కాస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. కోడి పందాలు ఆడుతున్న వారి నుంచి ఐదు బైక్‌లు, ఆరు కోడిపుంజులు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు 16 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలికపై వేధింపులు : కేసు నమోదు

ధరూరు: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికను వేధింపులకు గురిచేసిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు రేవులపల్లి పోలీసులు తెలిపారు. మైనర్ బాలికకు సదరు యువకుడు బలవంతంగా సెల్‌ఫోన్ ఇచ్చి, తనతో మాట్లాడాలని వేధిస్తున్నాడని.. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుకూర్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


ఆంజనేయులుగౌడ్ మృతదేహం

అలంపూర్: పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్‌ఐ వెంకటస్వామి వివరాల మేరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా గోనెగండ్ల మండలం కులుమాల గ్రామానికి చెందిన ఆంజనేయులు గౌడ్ (41), అతడి భార్య రాధమ్మ 15 ఏళ్లుగా అలంపూర్ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్నారు. ఈ నెల 1వ తేదీన రోజువారీ పనిలో భాగంగా వంట గదిలో గ్రైండర్ వద్దకు వెళ్లిన ఆంజనేయులు గౌడ్ ఒక్కసారిగా కిందపడి స్పృహ కోల్పోయాడు. అక్కడ ఉన్న సిబ్బంది చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి ఇద్దరు పిల్లలు సైతం అదే పాఠశాలలో చదువుతున్నారు. అతడి మృతిపై భార్య రాధమ్మ పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దొంగల ముఠా అరెస్టు

9 తులాల బంగారం, కిలో 20 తులాల వెండీ ఆభరణాలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి

వెల్దండ: వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన దొంగల ముఠాను పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. అందుకు సంబంధించిన వివరాలను శనివారం వెల్దండ సర్కిల్ కార్యాలయంలో సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి వెల్లడించారు. వివరాలిలా.. వికారాబాద్ జిల్లా బట్వారాం మండలం తోరమామిడి గ్రామానికి చెందిన గుండాల మాణిక్యం, నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం తుమ్మెన్‌పేటకు చెందిన చింత బాలరాజుతో పాటు మరో ఇద్దరు తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారు. వంగూరు మండలం రంగాపూర్, కల్వకుర్తి మండలం లింగసానిపల్లి, ఉప్పునుంతల మండలం జరిపిసదగోడు తదితర గ్రామాల్లో చోరీలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. వంగూరు మండలం శ్రీశైలం చౌరస్తాలో వాహనాల తనిఖీలు చేపట్టిన పోలీసులు కారులో వెళ్తున్న దొంగల ముఠాను పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. దొంగల ముఠా నుంచి 9 తులాల బంగారం, 1 కిలో 20 తులాల వెండీ ఆభరణాలతో పాటు రూ. 50 వేల నగదు, చోరీకి ఉపయోగించే ఇనుప వస్తువులు, కారును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. దాదాపుగా రూ. 9.35లక్షల విలువగల సొత్తును రికవరీ చేసినట్లు వివరించారు. నిందితులను కల్వకుర్తి కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దొంగలను పట్టుకున్న వెల్దండ, కల్వకుర్తి, వంగూర్ ఎస్‌ఐలతో పాటు సిబ్బంది ఆంజనేయులు, హరి, ఆంజనేయులు, కిశోర్‌రెడ్డి, రాంబాబు, శ్రీనివాస్‌రెడ్డిలకు ఎస్పీ చేతుల మీదుగా రివార్డులను అందజేయనున్నట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐలు కురుమూర్తి, మహేందర్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి ఘటనలో ముగ్గురికి రిమాండ్

కోస్గి: విధి నిర్వహణలో ఉన్న ఓ కానిస్టేబుల్‌తో దురుసుగా ప్రవర్తించి దాడికి పాల్పడిన ముగ్గురిని శనివారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. వికారాబాద్ జిల్లా పరిధిలో ప్రత్యేక విధులు నిర్వహించే కానిస్టేబుల్ కృష్ణ కోస్గిలో నివాసముంటున్నారు. బొంరాస్‌పేట మండలంలో గత నెల 28న విధి నిర్వహణలో ఉన్న అతడు.. రోడ్డు పక్కన బైక్ ఆపి, ఉన్నతాధికారులతో ఫోన్ మాట్లాడుతుండగా, కోస్గి మండలం సర్జఖాన్‌పేట గ్రామానికి చెందిన యువకులు వెంకటయ్య, చంద్రయ్య, మరో వెంకటయ్య తాగిన మైకంలో కానిస్టేబుల్‌తో దురుసుగా ప్రవర్తించారు. తాను పోలీసునని చెప్పినప్పటికీ.. వినిపించుకోకుండా దాడికి పాల్పడ్డారు. ఏకంగా కానిస్టేబుల్ బైక్ లాక్కొని దుర్భాషలాడారు. బాధిత పోలీస్ కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు ముగ్గురు యువకులపై గత నెల 29న కేసు నమోదైంది. సదరు యువకులను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆరుగురిపై కేసు నమోదు

ఎర్రవల్లి: తహసీల్దార్‌పై దాడి చేసిన ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్ శనివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని మునుగాలకు చెందిన ఇద్దరు జీపీ వర్కర్లను విధుల నుంచి తొలగించాలని గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, ఇబ్రహీం, శేషన్న, చాకలి మద్దిలేటి, బోయ వెంకటన్న శుక్రవారం ఇటిక్యాల తహసీల్దార్ నరేందర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గ్రామసభ ఏర్పాటుచేసి, వారిపై తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్‌కు వారికి తెలియజేశారు. ఈ క్రమంలో తహసీల్దార్‌ను సదరు వ్యక్తులు కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడినట్లు ఎస్‌ఐ తెలిపారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపున్నట్లు పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

మానవపాడు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైన ఘటన మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శనివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. మానవపాడు ఎస్సీ కాలనీకి చెందిన ఉల్చల రాజు గుడిసెలో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు బయటికి పరుగులు పెట్టడంతో ప్రాణాపాయం తప్పింది. గ్రామస్తుల సహకారంతో మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని నిత్యావసర సరుకులతో పాటు ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. దాదాపు రూ. లక్ష నష్టం వాటిల్లిందని బాధిత కుటుంబ సభ్యులు వాపోయారు.

నిప్పంటుకొని మరో గుడిసె..

భూత్పూర్: మండలంలోని కప్పెటలో బోయ రమేష్‌కు చెందిన గుడిసెకు ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమైంది. గుడిసెలో ఉన్న రూ. 50వేల నగదుతో పాటు రూ. లక్ష విలువగల సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని బాధితుడు కోరారు.

కేబుల్ దొంగకు దేహశుద్ధి


రైతులకు పట్టుబడిన కేబుల్ దొంగ

మిడ్జిల్: వ్యవసాయ బోరుమోటార్ల కేబుల్‌ను చోరీ చేస్తున్న దొంగను రైతులు పట్టుకొని దేహశుద్ధి చేసిన ఘటన మిడ్జిల్ మండలం కొత్తూరు రోడ్డు సమీపంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కొత్తూరు సమీపంలోని కేఎల్‌ఐ కాల్వకు అమర్చిన మోటార్ల కేబుల్‌ను గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేసి పారిపోతుండగా.. రైతులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా రైతులు పెద్దఎత్తున పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని కేబుల్ దొంగపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కొన్ని రోజులుగా బోరుమోటర్ల కేబుల్ చోరీ అవుతుండటంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, కేబుల్ చోరీకి పాల్పడిన వ్యక్తి అచ్చంపేటకు చెంది సంపంగి చిన్నా అలియాస్ గణేష్‌గా తెలిసిందని.. రైతుల ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

కంది కాయలను నిలుపుకోండి

- పైరుకు పురుగు ఆశించే సమయం
- అప్రమత్తంగా లేకపోతే దిగుబడిపై ప్రభావం


కంది పంట

అలంపూర్: పప్పు దినుసుల పంటలో కంది ముఖ్యమైనది. వానకాలం పంట సాగు చేసిన కంది ఇటీవలే కురిసిన వర్షాలతో పంటకు జీవనం వచ్చి ఏపుగా పెరుగుతుంది. మరికొన్ని రోజులకు పంట పూత దశకు చేరుకుంటుంది. కొందరు రైతులు కంది పంటను ప్రధాన పంటగా మరి కొందరు అంతర్ పంటగా సాగు చేశారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు తప్పనిసరిగా పంటలను గమనిస్తూ సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ శాఖ అధికారి సక్రియనాయక్ రైతులకు సూచిస్తున్నారు. కంది పంటకు వివిధ రకాల చీడపీడలు, పురుగులు ఆశించి దెబ్బతీసే ప్రమాదం ఉందని వాటిని ఎదుర్కొకపోతే తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వస్తోందని వివరిస్తున్నారు. సస్యరక్షణ పద్ధతులు ఎలా పాటించాలి, ఏఏ రకపు పురుగులు పంటను ఆశిస్తాయో వాటి నివారణ చర్యలను వ్యవసాయశాఖ ఏడీఏ ఈ విధంగా వివరిస్తున్నారు.

అధికారి సలహా
సక్రియనాయక్, ఇన్‌చార్జ్ డీఏఓ, గద్వాల

ఆకు చుట్టు పురుగు

కందిలో తొలి దశలో ఈ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఇవి ఆకుల అంచులకు దగ్గరగా చేరి చుట్టుకు పోయేటట్టు చేస్తోంది. ఆకు, పూతను కూడా కలిపి ఉంటగా (చుట్టగా) చేసి లోపలికి పురుగు చేరుకోని ఆకు, పూతను తినివేస్తుంది. ఈ పురుగును మొదటి దశలోనే మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్లు లేదా క్లోరిపైరిపాస్ 2.0 మిల్లీ లీటర్ల మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి నివారించుకోవచ్చు.

గూడు పురుగు

ఈ పురుగు పూత దశ నుంచి దాడి చేస్తోంది. లేత ఆకుల చివర్లో రెక్కల పురుగులు గుడ్లు పెడతాయి. ఇది లార్వాగా మారి లేత పువ్వులను కూడా దగ్గరగా గూడుగా చేసుకోని కాయలను నష్టపరుస్తుంది. దీని నివారణకు 2.0 మిల్లీ లీటర్ల క్లోరిపైరిపాస్ లేదా 1.0 మిల్లీ లీటర్ల నొవాల్యు రాస్‌ను నీటిలో కలిపి పిచికారీ చేయాలి.


కంది పంటకు ఆశించే పురుగులు

కాయతొలుచు పురుగు

కాయ తొలుచు పురుగులు పూత, పిందె దశలో ఎక్కువగా దాడి చేస్తాయి. లేత పువ్వులు లేదా చిగుర్ల మీద రెక్కల పురుగులు ఒక్కో గుడ్డు పెడతాయి. వీటి నుంచి లార్వాలు పెరిగి పువ్వులను కొరికి తింటాయి. దీని నివారణకు పంట విత్తిన 90 రోజుల నుంచి 100 రోజుల్లో చిగుళ్లను అడుగు మేర కత్తిరించాలి. లింగాకర్షన బుట్టలు అమర్చి పురుగు ఉధృతిని ఎప్పటికప్పుడు గమనించాలి. ఎకరానికి 10 నుంచి 15 అపక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి. మొదటి దశలో ఉన్న పురుగులు లేదా గుడ్లను గుర్తించగానే వేప గింజల కషాయం 5 శాతం పిచికారీ చేయాలి. కాయ తొలుచు పురుగు నివారణకు కొరాజెన్ 0.3 మి.లీ లీటరు నీటికి ఫ్లూబెండమైడ్ 30 మి.లీ 200 లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలి.

మరుకా మచ్చల పురుగు

ఈ పురుగు మొగ్గ, పిందె దశలో ఆశించి ఎక్కువగా నష్టం కలిగిస్తోంది. పూత దశలో పూలను గూడు లోపలి పదార్థాన్ని తింటుంది. కాయల దగ్గరికి చేర్చి గూడుగా కట్టి కాయలను రంధ్రాలు చేసి గింజలను తినడం వలన ఎక్కువ నష్టం కలుగుతుంది. దీని నివారణకు పంట పూత దశకు రాక ముందు నుంచే జాగ్రత్తలు చేపట్టాలి. పూత దశలో తప్పనిసరిగా పంటకు 5 శాతం వేప గింజల కషాయం లేదా వేప నునె 5.0 మిల్లీ లీటర్లను లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే రెక్కల పురుగులు గుడ్లు పెట్టకుండా నివారించ వచ్చును. వేప సంబంధిత మందులు వికర్షకాలుగా పని చేయడం వలన రెక్కల పురుగులు గుడ్లు పెట్టడానికి ఇష్టపడవు. అప్పటికే గుడ్లు పగిలి చనిపోతాయి. ఒకవేళ పురుగు ఆశించినట్లయితే నువాన్ 1 మి.లీ మరియు క్వినాల్‌ఫాస్ 2 మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఇందిరమ్మ ఇంటికి ఇక్కట్లు!

▶ మొదటి పేజీ తరువాయి

వాటా ఉండాల్సిందేనని కేంద్రం స్పష్టం చేసినట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధులతో చేపట్టే పథకాలకు ఇది వర్తించకున్నా.. కేంద్ర ప్రభుత్వ చేయూతతో అమలు చేసే పథకాల్లో మాత్రం ఈ నిబంధనను అమలు చేయాల్సి ఉంటుంది. హైదరాబాద్ నగరంలో పేదలు వ్యక్తిగత ఇళ్లను నిర్మించుకునేందుకు సొంత జాగా ఉండటం కష్టమే. అందుకే అపార్ట్‌మెంట్ల తరహాలో ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇస్తోంది. గతంలో వాంబే పథకం, ఆ తర్వాత ఇందిరమ్మ ఇళ్లు, ఇటీవల డబుల్ బెడ్రూం ఇళ్లు అదే తరహాలో నిర్మితమయ్యాయి. కాంగ్రెస్ సర్కారు ఇందిరమ్మ పథకం కింద కూడా ఇళ్ల సముదాయాలనే నిర్మించి ఇవ్వనుంది. ఈ తరహా ఇళ్లకు లబ్ధిదారుల వాటా చూపాలని కేంద్రం అడుగుతోంది.

పైసా అవసరం లేదన్న రాష్ట్ర సర్కారు

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారులు నయాపైసా చెల్లించాల్సిన అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. కానీ కేంద్ర నిబంధన ప్రకారం.. యూనిట్ కాస్ట్ కింద రాష్ట్ర ప్రభుత్వం భరించే రూ.5 లక్షలకుతోడు లబ్ధిదారుల వాటాను కూడా చూపించాల్సి వస్తుంది. ఆ మొత్తాన్ని లబ్ధిదారులు చెల్లించడంగానీ, లేదా రాష్ట్ర ప్రభుత్వమే భరించడంగానీ తప్పదని అధికారవర్గాలు చెప్తున్నాయి. హైదరాబాద్‌లో డబుల్ బెడ్రూం ఇళ్లకు రూ.ఏడు లక్షల నుంచి రూ.8 లక్షల చొప్పున ఖర్చయ్యాయి. యూనిట్ కాస్ట్‌కు అదనంగా అయ్యే మొత్తాన్ని లబ్ధిదారు వాటాగా చూపే చాన్స్ ఉండనుంది.

పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల ప్రణాళిక ఏంటి?

తొలుత ఇందిరమ్మ ఇళ్లను సొంత జాగా ఉన్నవారికే మంజూరు చేయనున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. అయితే హైదరాబాద్, ఇతర ప్రధాన పట్టణాల్లో సొంత జాగా ఉన్న పేదల సంఖ్య నామమాత్రమే. అలాంటప్పుడు పేదలకు ఇళ్లు ఎలాగనే ప్రశ్నలు వస్తున్నాయి. ఈ దిశగా ప్రభుత్వ ప్రణాళిక ఏమిటనే చర్చ జరుగుతోంది.

హెచ్‌ఎండీఏ మాస్టర్‌ప్లాన్- 2031ను పునఃపరిశీలించాలి

సీఎంకు బీజేపీ నేత గూడూరు సూచన

సాక్షి, హైదరాబాద్: 2013లో నోటిఫై చేసిన హెచ్‌ఎండీఏ మాస్టర్‌ప్లాన్–2031ను పునఃపరిశీలించి, అవసరమైన మార్పులు చేర్పులు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి బీజేపీనేత గూడూరు నారాయణరెడ్డి సూచించారు. ప్రస్తుతం హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో మారిన పరిస్థితులకు మాస్టర్‌ప్లాన్–31 ఏమాత్రం ఉపయోగపడదని శనివారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ మాస్టర్‌ప్లాన్ బిల్డర్లు, రియల్ ఎస్టేట్ డెవలపర్లను యాచకులుగా మార్చేస్తుందని ఆందోళన వెలిబుచ్చారు. ఇప్పటికే హైడ్రా రియల్ ఎస్టేట్ డెవలపర్ల వెన్నువిరిచేసిందన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత హైదరాబాద్ అభివృద్ధికి అనుగుణంగా ఈ మోడల్‌ను మార్చాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల అనేక మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నందున మళ్లీ మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.



75 ప్రశ్నలతో కుటుంబ సర్వే

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సన్నద్ధం • పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ విడుదల
రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమం పూర్తి • జిల్లాల్లో కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్: ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలు నమోదు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు అధికార యంత్రాంగం సిద్ధమవుతున్నది. ఈ సర్వేపై రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించిన ప్రభుత్వం.. సర్వే ఉద్దేశం, లక్ష్యం తదితర అంశాలను వివరిస్తూ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌ను విడుదల చేసింది. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో కొనసాగే ఈ సర్వేకు సంబంధించిన పూర్తిస్థాయి సూచనలను అందులో పొందుపర్చింది. సర్వే రెండు భాగాలుగా సాగుతుంది. మొదటి విభాగం (పార్ట్–1)లో కుటుంబ యజమాని, సభ్యుల వ్యక్తిగత వివరాలకు సంబంధించిన ప్రశ్నలుంటాయి. రెండో విభాగం(పార్ట్–2)లో కుటుంబ వివరాలకు సంబంధించిన ప్రశ్నలుంటాయి. సర్వే ప్రశ్నావళిలో 75 ప్రశ్నలుంటాయి. ఇందులో 56 ప్రధాన ప్రశ్నలు కాగా.. మిగతా 19 ఉప ప్రశ్నలు.

ఎంపిక బాధ్యతలు జిల్లా కలెక్టర్లకు

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియలో జిల్లా కలెక్టర్ల పాత్ర కీలకం. జిల్లాస్థాయి, మండల స్థాయి నోడల్ అధికారుల నియామకం మొదలు, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్ల గుర్తింపు ప్రక్రియ అంతా కలెక్టర్ల ఆధ్వర్యంలోనే కొనసాగుతుంది. అదేవిధంగా ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు బ్లాకుల కేటాయింపు బాధ్యత కూడా కలెక్టర్లదే. కిందిస్థాయి అధికారులకు సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు సర్వే నిర్వహించాల్సిన తీరు, సమాచార గోప్యత తదితరాలకు సంబంధించిన శిక్షణ కలెక్టర్లే ఇస్తారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లుగా ప్రభుత్వ ఉద్యోగులనే ఎంపిక చేయాలి. అవసరం ఉన్న చోట మాత్రం సీఆర్‌పీ (కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్), గెస్ట్ టీచర్ల సేవలు వినియోగించుకోవచ్చు. సెన్సెస్ డైరెక్టర్ నుంచి ఎన్యుమరేషన్ బ్లాక్ (ఈబీ) మ్యాపులు తీసుకుని ఆ మేరకు బ్లాకుల విభజన చేయాలి. ఒక ఎన్యుమరేషన్ బ్లాక్‌లో 175 వరకు కుటుంబాలుంటాయి. అంతకంటే ఎక్కువ కుటుంబాలు ఉంటే బ్లాకుల విభజన చేయాలి. ఎన్యుమరేటర్లు సర్వే పూర్తి చేసిన తర్వాత ఆ సమాచారంలోని 10 శాతం కుటుంబాలను ర్యాండమ్ పద్ధతిలో ఎంపిక చేసి వాటిని సూపర్‌వైజర్లు మరోమారు తనిఖీ చేయాలి. ఎన్యుమరేటర్ పనితీరును ఈ రకంగా అంచనా వేయాలి. జిల్లా నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్‌ను నియమించాలి. సర్వే నిర్వహణలో భాగంగా రోజువారీ పురోగతిని ప్రణాళిక శాఖకు ప్రతిరోజు సాయంత్రం 6గంటల లోపు పంపాలి.

పక్షం రోజుల్లో ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక

5న లేదా 6న ప్రక్రియ ప్రారంభిస్తాం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- రాజకీయ జోక్యం లేకుండా యాప్ ద్వారా ఎంపిక
- ఇంటి పునాదుల నుంచి పూర్తయ్యేదాకా దశలవారీగా సొమ్ము విడుదల
- అవసరమైతే కేంద్ర ప్రభుత్వ పెద్దల ఫొటోలు పెడతామని వెల్లడి
- ఈ టర్మ్ అంతా రేవంత్‌రెడ్డే సీఎంగా ఉంటారని వ్యాఖ్య



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాన్ని ఈ నెల ఐదు, ఆరు తేదీల్లో ప్రారంభించి పక్షం రోజుల్లో పూర్తి చేస్తామని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రత్యేక యాప్ ద్వారా జరుగుతుందని, ఎంపికలో రాజకీయ జోక్యం ఏమాత్రం ఉండదని చెప్పారు. నిరుపేదలకు సొంతింటి వసతి కల్పించడం లక్ష్యంగా ముందుకుసాగుతున్నామని పేర్కొన్నారు. శనివారం సాయంత్రం సచివాలయంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. ''ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరిటే మంజూరు చేస్తాం. 400 చదరపు అడుగుల విస్తీర్ణానికి తగ్గకుండా ఇళ్లను నిర్మించుకోవాల్సి ఉంటుంది. ఈ ఇళ్లకు ప్రత్యేక డిజైన్ అంటూ ఉండదు. లబ్ధిదారులకు ఉన్న జాగా ఆధారంగా వారే కావాల్సిన ఆకృతిలో నిర్మించుకోవచ్చు. అయితే వంటగది, మరుగుదొడ్డి కచ్చితంగా ఉండేలా చూడాలి.

దశలవారీగా సొమ్ము విడుదల: ఇందిరమ్మ ఇళ్లకు పునాదులు నిర్మించుకున్నాక రూ.లక్ష, గోడల నిర్మాణం తర్వాత రూ.లక్షన్నర, పైకప్పునకు రూ.లక్షన్నర చొప్పున చెల్లిస్తాం. ఇంటి నిర్మాణం పూర్తయ్యాక మిగతా మొత్తం అందజేస్తాం. ఈ సొమ్మును బ్యాంకు ఖాతాకు ఆన్‌లైన్ ద్వారా జమ చేస్తాం. తొలిదశలో కేవలం సొంత జాగా ఉన్నవారికే ఇళ్లను మంజూరు చేస్తాం. తదుపరి విడతలో భూమిలేని నిరుపేదలకు స్థలం ఇచ్చి నిధులు అందజేస్తాం. నియోజకవర్గానికి 3,500కు తగ్గకుండా ఇళ్లను మొదటి విడతలో మంజూరు చేస్తున్నాం. నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లను నిర్మించేలా చూస్తాం. ఈ ఇళ్ల నిర్మాణ పర్యవేక్షణ కోసం 16 శాఖల నుంచి సిబ్బందిని సమీకరిస్తున్నాం.

నిధులను సమీకరించుకుంటాం..: తొలిదశ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.20వేల కోట్ల వరకు ఖర్చవుతాయి. బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.7,740 కోట్లను కేటాయించింది. కేంద్రం నుంచి వీలైనన్ని ఎక్కువ నిధులు పొందేందుకు ప్రయత్నిస్తున్నాం. గత ప్రభుత్వం చేపట్టి వదిలేసిన ఇళ్లను కూడా పూర్తి చేస్తాం. అవసరమైన నిధులను వివిధ మార్గాల్లో సమీకరించుకుంటాం. కొత్తగా ఏర్పడే ఇందిరమ్మ కాలనీల్లో ప్రభుత్వమే మౌలిక వసతులు కల్పిస్తుంది.

కేంద్ర ప్రభుత్వ పెద్దల ఫొటోలు పెడతాం..

గత ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులు తేవటంలో విఫలమైంది. మేం ఆ పరిస్థితి రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర నిబంధనలు అనుసరించటంతోపాటు అవసరమైతే కేంద్ర ప్రభుత్వ పెద్దల ఫొటోలు పెట్టాలంటే కూడా పెడతాం. మాకు భేషజాలు లేవు. సర్పంచుల పదవీకాలం పూర్తయినందున ప్రస్తుతం ఇందిరమ్మ కమిటీల్లో వారి ప్రాతినిధ్యం లేదు. తదుపరి దశ నాటికి వారు ఉండేలా అవసరమైతే జనవరి నాటికే సర్పంచ్ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తాం..''అని పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఈ టర్మ్ అంతా రేవంతే సీఎం

సీఎం రేవంత్‌రెడ్డిని మారుస్తారంటూ కొందరు పనిగట్టుకుని చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం టర్మ్ పూర్తయ్యేందుకు ఇంకా నాలుగేళ్ల ఒక నెల సమయం ఉందని, అప్పటి వరకు రేవంతే సీఎంగా ఉంటారని చెప్పారు. తదుపరి కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి ఎవరనేది అధిష్టానం నిర్ణయిస్తుందన్నారు. ఏదో ఒకటి మాట్లాడాలన్న ఉద్దేశంతో విపక్షాలు లేనిపోని ప్రకటనలు చేస్తున్నాయని విమర్శించారు. ఒకట్రెండు రోజులు అటూఇటూ అయినా.. తాను చెప్పినట్టు రాజకీయ బాంబులు పేలటం తథ్యమని పేర్కొన్నారు.

ఏఈవోలతో చర్చలు సఫలం

- సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలత
- నిర్దేశించిన బాధ్యతలు నిర్వర్తిస్తామని ప్రభుత్వానికి స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వంతో వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈవో) సంఘ ప్రతినిధుల చర్చలు సఫలమయ్యాయి. ఏఈవోలకు నిర్దేశించిన బాధ్యతలను నిర్వర్తించనున్నట్లు ఏఈవో సంఘాల ప్రతినిధులు ప్రభుత్వానికి హామీ ఇచ్చారు. వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో శనివారం జరిపిన చర్చలు సఫలమైన తర్వాత వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డి.శ్రీనివాస్‌గౌడ్, కె.సురేశ్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఏఈవోలంతా వెంటనే డీసీఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని విధులను నిర్వర్తించాలని కోరారు. నిర్దేశించిన విధులను పూర్తి చేయాలని, ఫొటోలను కూడా అప్‌లోడ్ చేయాలని ఏఈవోలకు సూచించారు. సస్పెండ్ అయిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోనున్నట్లు ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఒకట్రెండురోజుల్లో ఉత్తర్వులు వస్తాయని వివరించారు. సర్వీసు రిజిస్టర్‌లో వారి సస్పెన్షన్ ఉత్తర్వుల ప్రస్తావన ఉండదని స్పష్టం చేశారు. ఏడీవో గ్రేడ్–2లను గ్రేడ్–1గా పదోన్నతి కల్పించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని, దీంతో కేడర్‌స్ట్రెంగ్త్‌కు అనుగుణంగా అర్హులందరికీ పదోన్నతులు వస్తాయన్నారు. ఇందుకు సంబంధించిన ఫైలు వెంటనే సర్క్యులేట్ చేస్తామని కార్యదర్శి హామీ ఇచ్చినట్లు తెలిపారు. రైతుబీమా పథకం అమలులో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతువేదికల నిర్వహణ నిధులను కూడా ప్రభుత్వం వెంటనే విడుదల చేస్తుందని తెలిపారు.

వచ్చే నెలలో మహిళా శక్తి వారోత్సవాలు

- ఉపాధి హామీ పనులపై డీఆర్డీవోలకు మంత్రి సీతక్క ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: వచ్చేనెల మొదటి వారంలో ఇందిరా మహిళా శక్తి పథకానికి సంబంధించి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. బ్యాంకుల ద్వారా మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇప్పించేలా గ్రామాల్లో బ్యాంకర్లతో సదస్సులు నిర్వహించాలని సూచించారు. ప్రతీ మహిళా స్వయం సహాయక సంఘాల్లో చేర్చేలా అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. శనివారం సచివాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారుల (డీఆర్‌డీవో)లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా వచ్చే ఐదునెలల్లో చేపట్టాల్సిన పనులపై జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పథకం ద్వారా కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు ప్రజలకు ఉపయోగపడే పనులను చేపట్టాలన్నారు. మార్చి లోపు చేపట్టే ఉపాధి హామీ పనుల కోసం రూ.1,372 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఉపాధి భరోసా, పంట పొలాలకు బాటలు, పండ్ల తోటల పెంపకం, ఇంకుడుగుంతలు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, స్వచ్ఛ భారత్ మిషన్‌కు ఈ నిధులు వెచ్చించాలని చెప్పారు. పీఆర్ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్, సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్, పీఆర్ –ఆర్డీ కమిషనర్ అనితా రామచంద్రన్, స్పెషల్ కమిషనర్ బి.షఫీఉల్లా పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన పీయూ వీసీ




మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్ శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. వీసీగా బాధ్యతలు తీసుకున్న తర్వాత మొదటిసారి రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు చెందిన వీసీలు రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఎవరి ప్రభావంతోనో వీసీలను నియమించలేదని, కేవలం అర్హత మెరిట్, ఆధారంగానే నియమించామన్నారు. కొంతకాలంగా యూనివర్సిటీలపై విశ్వాసం సన్నగిల్లిందని, తిరిగి వాటి గౌరవాన్ని పెంపొందించాలన్నారు. యూనివర్సిటీల్లో ప్రమాణాలను పెంచేందుకు సమగ్ర అధ్యయనం చేయాలని, అందుకోసం అవసరమైతే కన్సల్టెన్సీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలని వినతి..

యూనివర్సిటీలో పలు హాస్టల్స్‌లో చదువుతున్న ఎస్టీ విద్యార్థులకు సంబంధించిన హాస్టల్ భవనం మంజూరైందని, అందుకు సంబంధించిన నిధులు విడుదల చేయాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను వీసీ జీఎన్ శ్రీనివాస్ విన్నించారు. ఈమేరకు ఆమె స్పందిస్తూ అందుకు సంబంధించిన నిధులను అతిత్వరలో విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



రాత్లావత్ సిద్ధూ

రాజాపూర్: మండలంలోని పలుగుగుట్టతండాకు చెందిన రాత్లావత్ సిద్ధూ జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ గద్వాల కళాశాల ప్రిన్సిపాల్ రాజు శనివారం తెలిపారు. రెండు రోజుల క్రితం వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీలో సిద్ధూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 6న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బారెల్లిలో జరిగే పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. కాగా, రాత్లావత్ సిద్ధూ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై తల్లిదండ్రులు అంబర్‌సింగ్, స రోజతో పాటు తండావాసులు హర్షం వ్యక్తంచేశారు.

వైభవంగా కల్యాణోత్సవం

- తొలిరోజు మయూర వాహనంపై స్వామివార్ల ఊరేగింపు
- కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



కురుమూర్తిస్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులు



కల్యాణ ఉత్సవంలో మంగళ సూత్రాన్ని చూపిస్తున్న అర్చకులు

చిన్నచింతకుంట: పాలమూరులో ప్రసిద్ధి చెందిన అమ్మాపురం కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. సిబ్బంది తెల్లవారుజామున స్వామివారి ప్రధాన ఆలయాన్ని శుద్ధి చేసి సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించారు. ఉదయం 8 గంటలకు ధ్వజారోహహణ, దేవాతాహనం, భేరిపూజ, అష్టోతర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణలతో కురుమూర్తి స్వామి, పద్మావతి, అలివేలు మంగమ్మ అమ్మవార్ల కల్యాణం కనులపండుగగా చేపట్టారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు ఈ వేడుకను తిలకించేందుకు తరలివచ్చారు.కార్యక్రమంలో ఆలయ ఈఓ మధనేశ్వర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి దంపతులు, ప్రధాన అర్చకులు వెంకటయ్య, నర్సింహులు, కమిటీ సభ్యులు భాస్కరచారి, శేఖర్ పాల్గొన్నారు.

• బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు శనివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతుడైన కురుమూర్తి స్వామివార్లు మయూర వాహనంపై ఊరేగించారు. అందంగా ముస్తాబు చేసిన ఉత్సవమూర్తులను పల్లకీలో ఆసీనులను చేసి ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపు ప్రారంభించారు. స్వామివారి ప్రధాన ఆలయం నుంచి ఉద్దాల మండపం వరకు సాగింది. ఈ సందర్భంగా గోవిందనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.



కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న ఐజీ రమేష్‌రెడ్డి దంపతులు

• కురుమూర్తి స్వామిని ప్రొవిజన్స్ అండ్ లాజిస్టిక్స్ ఐజీ రమేష్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువలతో సత్కరించారు.

కురుమూర్తి రాయుడి అలంకారోత్సవానికి ఏర్పాట్లు

- ఈ నెల 6న వైభవంగా వేడుక
- తరలిరానున్న వందలాది భక్తులు

ఆత్మకూర్: తెలంగాణ ప్రజల ఆరాధ్యదైవం కురుమూర్తిస్వామి అలంకారోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కోట్లాది రూపాయల విలువగల స్వామివారి ఆభరణాలను ఆత్మకూర్ పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో భద్రపరుస్తూ వస్తున్నారు. కురుమూర్తిస్మామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 6న ఉదయం 10:30 గంటలకు అలంకారోత్సవం నిర్వహించనున్నారు. తరతరాల ఆనవాయితీ ప్రకారం గాడి వంశస్తులు స్వామివారి ఆభరణాలను బ్యాంకు నుంచి తలపై పెట్టుకొని ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్తారు. ఈసారి చిన్నచింతకుంటకు చెందిన గాడి లక్ష్మణ్ స్వామివారి ఆభరణాలను తీసుకెళ్లనున్నారు.

రూ. కోట్ల విలువచేసే ఆభరణాలు..

ముక్కెర రాజ వంశీయులు స్వామివారికి ఆభరణాలను బహూకరించారు. అందులో కిరీటం, భుజకీర్తులు, శంకుచక్రాలు, మకర కుండాలు, హస్తాలు, నామం, ముత్యాల హారాలు, పచ్చలతో పొదిగిన హారాలు ఉన్నాయి. వాటిని ఎస్‌బీఐ లాకర్ నుంచి బయటకు తీసి ప్రత్యేక పూజల అనంతరం ఆత్మకూర్ పరమేశ్వరస్వామి చెరువుకట్ట మీదుగా కొత్తపల్లి, దుప్పల్లి గ్రామాల గుండా అమ్మాపూర్‌కు చేరుకుంటాయి. అనంతరం ముక్కెర రాజవంశీయుడైన రాజ శ్రీరాం భూపాల్ నివాసంలో ఆభరణాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి దేవస్థానానికి ఆభరణాలను చేర్చి స్వామివారికి అలంకరిస్తారు. దీంతో స్వామి కొలువైన కాంచనగుహ స్వర్ణకాంతులను సంతరించుకుంటుంది. ఉత్స వాలకు వందలాది భక్తులతో పాటు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు తరలిరానున్నారు.



స్వామివారి ఆభరణాలు

భారీ పోలీసు బందోబస్తు..

కురుమూర్తిరాయుడి అలంకారోత్సవం సందర్భంగా వనపర్తి ఎస్పీ, డీఎస్పీ, ఇద్దరు సీఐలు, 10 మంది ఎస్‌ఐలు, 15 మంది ఏఎస్‌ఐలతో పాటు వంద మంది పోలీసు సిబ్బంది, సీపీఎఫ్, సెంట్రల్ ఆర్మ్‌డ్ ప్రొటెక్షన్ ఫోర్స్‌తో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ శివకుమార్ తెలిపారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రాజకీయ పార్టీల నాయకులు, భక్తులు సహకరించాలని కోరారు.

ఆరు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ఆత్మకూరు/ధరూరు/దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు శనివారం సాయంత్రం 15,500 క్యూసెక్కులఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఎగువ, దిగువ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి నిరంతరాయంగా కొనసాగుతోంది. మొత్తం ఆరు యూనిట్లలలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ సూరిబాబు తెలిపారు. ఎగువలో 3 యూనిట్ల ద్వారా 137 మెగావాట్లు, 333.459 ఎంయూ, దిగువలో 3 యూనిట్ల ద్వారా 120 మెగావాట్లు, 319.165 ఎంయూ ఉత్పత్తిని చేపట్టామన్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 652.624 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని తెలిపారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 10,161 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. భీమా లిఫ్టు–1కు 650 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 72 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,140 క్యూసెక్కులు, కుడి కాల్వకు 730 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి 12,772 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.439 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

• శ్రీశైలం జలాశయంలో శనివారం నీటిమట్టం 880.7 అడుగుల వద్ద 192.0906 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల, సుంకేసుల నుంచి మొత్తం 16,886 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది.ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కుల నీటిని దిగువున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి నిలిపివేశారు. పోతిరెడ్డిపాడు ద్వారా 15,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,533, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 8.974 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.



దిగువ జూరాలలోని పవర్‌హౌజ్‌లోకి చేరుతున్న వరదనీరు

సుంకేసులలో నిలకడగా ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంలో ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతుంది. శనివారం ఎగువ నుంచి 9,540 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా..రెండు గేట్లు తెరిచి 6,710 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. అలాగే కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.



రిస్క్ అయినా.. బాధ్యతను విస్మరించలేదు



మరమ్మతు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

అసలే నీటితో నిండుగా ఉన్న చెరువు. అందులో ఉన్న విద్యుత్ వైరు తెగిపడింది. ఫలితంగా మూడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో అధికారులు చెరువులోని విద్యుత్ లైన్ సరిచేసేందుకు రిస్క్‌గా భావించలేదు. చెరువు నీటిలో నడుచుకుంటూ వెళ్లి మరమ్మతు చేపట్టి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వివరాల్లోకి వెళ్తే.. అమరచింత మండల కేంద్రంలోని చింతల్‌కుంట చెరువులో నుంచి మస్తీపురం, నందిమళ్ల, మూలమళ్ల గ్రామాలకు 33 కేవీ విద్యుత్ లైన్ ఉంది. శనివారం చెరువు మధ్యలో ఉన్న స్తంభం వద్ద విద్యుత్ తీగ తెగిపడింది. గమనించిన ట్రాన్స్‌కో అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేశారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్, ఏడీ శంకర్, ఏఈ నరసింహ్మం, లైన్‌మన్ జగదీష్ నాయక్, లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ పాల్గొన్నారు.

– అమరచింత